మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

'కాళేశ్వరం'పై విచారణ షురూ

- కమిషన్ ఎదుట ప్రాజెక్టుపై నీటిపారుదలశాఖ ప్రజెంటేషన్
- ఇరిగేషన్ సెక్రటరీ నేతృత్వంలో నోడల్ బృందం ఏర్పాటు
- అవసరమైతే కేసీఆర్ వివరణ కోరతామన్న జస్టిస్ ఘోష్
- ఫిర్యాదుల స్వీకరణకు బీఆర్కే భవన్‌లో ప్రత్యేక బ్యాక్సులు

హైదరాబాద్, ఏప్రిల్25 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయవిచారణ గురువారం ప్రారంభమైంది. జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ రాష్ట్ర నీటిపారుదలశాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై సుదీర్ఘంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటన ప్రారంభించనున్నట్టు చెప్పారు. ప్రాజెక్టులోని నిర్మాణ లోపాలు తదితర అంశాలపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం కలకత్తాకు చెందిన జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో న్యాయ విచారణ కమిషన్ ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. విచారణ కోసం బీఆర్కే భవన్‌లో ఇప్పటికే ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కమిషన్‌కు సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జా నేతృత్వంలో నోడల్ అధికారుల బృందాన్ని నియమించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. విచారణకు అంగీకరించిన కమిషన్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జస్టిస్ ఘోష్‌తో సమావేశమై కాళేశ్వరం అంశాలను వివరించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. జస్టిస్ ఘోష్‌కు ఏపీ సీజేగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, లోక్‌పాల్‌గా అపార అనుభవం ఉన్నదని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా నివేదికనివ్వాలని కమిషన్‌కు కోరినట్టు చెప్పారు. కమిషన్ అడిగిన వివరాలను అందిస్తామని తెలిపారు. విచారణకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. మేడిగడ్డ ఆనకట్టపై ఎన్డీఎస్ఏ కమిటీ నివేదిక ప్రకారం మరమ్మతులు,అంశాలపై చర్చించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఉత్తమ్ వివరించారు.

అవసరమైతే కేసీఆర్‌ను పిలుస్తాం

జస్టిస్ ఘోష్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై రెండు మూడు రోజుల్లో ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తామని చెప్పారు. తాను స్వతహాగా ఇంజినీర్‌ను కాదని తెలిపారు. విచారణలో నిపుణుల అభిప్రాయాలను, ఎన్డీఎస్ఏ, విజిలెన్స్, కాగ్ రిపోర్టులను పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. త్వరలో రాష్ట్ర ఇంజినీర్లతో, ఎన్డీఎస్ఏ అథారిటీతో సమావేశం అవుతామని చెప్పారు. బరాజ్‌లతో సంబంధం ఉన్న అందరినీ కలుస్తామని, కావాల్సిన సహాయక సహకారాలను తీసుకుంటామని వెల్లడించారు. నిర్మాణ సంస్థలతోపాటు అవసరమైతే రాజకీయ నేతలకు నోటీసులు ఇస్తామని తెలిపారు. అవసరమైతే మాజీ సీఎం కేసీఆర్‌ను పిలిచి వివరాలు సేకరిస్తామని తెలిపారు. లీగల్ అంశాల ఆధారంగానే విచారణ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఫిర్యాదుతోపాటు అఫిడవిట్ ఉండాలి

జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్టు నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా తెలిపారు. ఇందు కోసం బీఆర్కే భవన్ 8వ అంతస్థులో ప్రత్యేక బ్యాక్సులను ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ఫిర్యాదు చేయాలనుకునేవారు ఫిర్యాదు/వినతిపత్రాలను ఆధారాలతోసహా నోటరీ ద్వారా ప్రమాణపూర్వక అఫిడవిట్ రూపంలో సీల్డ్ కవర్‌లో ఉంచి పెట్టెల్లో వేయాలని కోరారు. పోస్ట్ ద్వారా అయినా పంపవచ్చని చెప్పారు. మే 31 వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామని చెప్పారు. నోటరీ అఫిడవిట్ లేని, సాక్ష్యాధారాలు లేని పత్రాలను తిరస్కరిస్తామని స్పష్టంచేశారు.

మే 27న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

- వరంగల్-నల్లగొండ-ఖమ్మం స్థానానికి షెడ్యూల్ విడుదల
- మే 2 నుంచి నామినేషన్ల స్వీకరణ
- ఆది నుంచీ బీఆర్ఎస్‌కు కంచుకోట

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల షెడ్యూల్	
నోటిఫికేషన్, నామినేషన్లు	మే 2
నామినేషన్ల చివరి తేదీ	మే 9
నామినేషన్ల పరిశీలన	మే 10
ఉపసంహరణ	మే 13
పోలింగ్ తేదీ	మే 27
పోలింగ్ సమయం	ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు
ఓట్ల లెక్కింపు	జూన్ 5

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): వరంగల్-నల్లగొండ-ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నికను మే 27న నిర్వహిస్తారు. నామినేషన్లను మే 2 నుంచి 9 వరకు స్వీకరిస్తారు. జూన్ 5న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నియోజకవర్గం నుంచి శాసనమండలిలో ప్రాతినిధ్యం వహించిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ స్థానానికి ఎన్నికయ్యే వారు 2027 మార్చి 29 వరకు ఆ పదవిలో కొనసాగుతారు. నియోజకవర్గం పరిధిలోని మొత్తం 12 జిల్లాల్లో 4,61,806 మంది ఓటర్లు ఉన్నారు. వీరి కోసం 600 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నియోజకవర్గం మొదటి నుంచి బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్నది. గతంలో రెండు సార్లు బీఆర్ఎస్ తరపున కపిలవాయి దిలీప్‌కుమార్, ఆ తరువాత రెండుసార్లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. ఈ సారి కూడా బీఆర్ఎస్ అభ్యర్థికే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. త్వరలోనే బీఆర్ఎస్ అభ్యర్థిని అధికారికంగా ప్రకటించనున్నట్టు సమాచారం.

మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో మాట్లాడుతున్న హరీశ్‌రావు, చిత్రంలో వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్, మాజీ మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి తదితరులు

నాడు ఓటుకు నోటు.. నేడు ఓటుకు ఒట్టు

- రేవంత్ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారు : హరీశ్‌రావు

తొర్రూరు, ఏప్రిల్ 25: నాడు తెలంగాణ ప్రభుత్వాన్ని అస్థిరపర్చాలని ఓటుకు నోటుతో, నేడు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని వాడుకుంటూ ఓటుకు ఒట్టుతో రేవంత్ రెడ్డి మోసం చేసేందుకు మరోసారి సిద్ధమయ్యారని హరీశ్‌రావు ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అడ్డదారిలో అధికారంలోకి వచ్చేందుకు రేవంత్‌రెడ్డి అడ్డగోలు హామీలు ఇచ్చారని ధ్వజమెత్తారు. నాలుగున్నర నెలలైనా అమలు చేయకపోవటంతో ప్రజల చేతిలో చావుదెబ్బ తప్పదని దేవుళ్ల మీద ఒట్లు వేస్తూ మళ్లీ ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పాలకుర్తి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, బస్వరాజ్ సారయ్య, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, బానోత్ శంకర్‌నాయక్, నన్నపునేని నరేందర్, ఎన్నికల పరిశీలకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజీనామా లేఖతో నేనొస్తున్నా

మొదటిపేజీ తరువాయి...

గమనించాలని అన్నారు. 'మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలు చేసి మూడు జిల్లాలకు మూడు మెడికల్ కళాశాలలు మంజూరు చేసింది కేసీఆరే. రూ.100 కోట్లతో మెదక్‌కు రైలు సౌకర్యం కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌దే. మెదక్‌లో నాలుగు లేన్ల రోడ్డు, హల్దీ వాగులోకి నీళ్లు అందించిందీ బీఆర్ఎస్ సర్కారే' అని వివరించారు. 1952లో బీహెచ్ఈఎల్ ఏర్పాటైతే, ఇందిరాగాంధీ మెదక్ నుంచి ఎంపీగా గెలిచిన 1980లో ఏర్పాటు చేశారని రేవంత్ చెప్పడం విడ్డూరంగా ఉన్నదని అన్నారు. స్క్రిప్ట్ రాసేవానికి లేకున్నా, చదివేవారికి బుద్ధి ఉండాలని చురక అంటించారు. 'నీ ఇజ్జత్ పోయినా ఫర్వాలేదు. సీఎం కుర్చీ ఇజ్జత్ తీస్తున్నవ్' సీఎం రేవంత్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

దేవుళ్లపై ప్రమాణాలు

సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడికి వెళితే అక్కడ దేవుళ్లపై ప్రమాణాలు చేస్తున్నారని, రేవంత్ ఎన్ని ప్రమాణాలు చేసినా ప్రజలు నమ్మబోరని హరీశ్ అన్నారు. 'నా ఎత్తు మీద ఉన్న ధ్యాస రైతుల ధాన్యం కొనుగోలు చేయటంలో చూపెట్టు. భువనగిరిలో ఎస్సీ మహిళలపై అరాచకాలు జరుగుతున్నా, 280 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నా, ఆటో కార్మికుల ఆత్మహత్య చేసుకున్నా పట్టించుకోలే' అని విమర్శించారు. అధికార మదంతో కాంగ్రెస్ నాయకులు గాల్లో తేలుతున్నారని, ఎంపీ ఎన్నికల్లో బుద్ధి చెబితే భూమ్మీదికి వస్తారని మండిపడ్డారు.

బీజేపీ మాటలు నమ్మితే నీళ్లు లేని బావిలో దూకినట్టే

బీజేపీ మాటలు నమ్మితే నీళ్లు లేని బావిలో దూకినట్టేనని హరీశ్‌రావు అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఒక్క మెడికల్, నర్సింగ్ కళాశాల కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. దుబ్బాకలో ఎడ్లు, నాగలి ఇస్తామని మోసం చేసిన రఘునందన్‌రావుకు ప్రజలు బుద్ధి చెప్పారని, ఎంపీ ఎన్నికల్లో సైతం బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలకు తక్కువ కాలంలోనే నీళ్లు ఏవో, పాలు ఏవో తెలిశాయని, టీవీ 9 చర్చలో కాంగ్రెస్ మోసాలను కేసీఆర్ కండ్లకు కట్టినట్టు వివరించారని గుర్తు చేశారు. కేసీఆర్ బస్సు యాత్రకు అపూర్వ స్పందన లభిస్తున్నదని, పార్లమెంటు ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలవటం ఖాయమని తెలిపారు. ఉన్న జిల్లాలను ఎత్తివేసేందుకు రేవంత్‌రెడ్డి సర్కార్ కుట్ర చేస్తున్నదని, ఓటుతో బుద్ధి చెప్పాలని అన్నారు. ఎంపీగా పోటీ చేసే అభ్యర్థుల్లో ఒకరు బ్లాక్‌మెయిలర్ అని, ఒకరు 6వ తరగతి అని, మన మాజీ కలెక్టర్ అయితేనే పార్లమెంట్‌లో మన హక్కుల కోసం పోరాటం చేస్తారని చెప్పారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌గా విశేష సేవలు అందించిన వెంకట్రామిరెడ్డి ప్రజాసేవ చేసేందుకు వస్తున్నారని, రూ.100 కోట్ల ట్రస్టు ద్వారా ఎంతో మంది పేదలకు మేలు జరుగుతుందని, ఆయనను ఆశీర్వదించాలని కోరారు. ర్యాలీలో ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతాప్రభాకర్, మహిపాల్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ హేమలతాశేఖర్‌గౌడ్, ఎమ్మెల్సీలు శేరి సుభాశ్‌రెడ్డి, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, చంద్రాగౌడ్, బట్టి జగపతి పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో తెలంగాణ సత్తా

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : జేఈఈ మెయిన్ ఫలితాల్లో తెలంగాణ సత్తా చాటింది. రాష్ట్రానికి చెందిన 15 మంది విద్యార్థులు 300కు 300 మార్కులు సాధించారు. దేశవ్యాప్తంగా 56 మంది విద్యార్థులకు 100 పర్సంటైల్‌ను సొంత చేసుకోగా, వీరిలో 15 మంది (26%) టాపర్లు తెలంగాణకు చెందినవారే ఉన్నారు. 100 పర్సంటైల్ పొందిన వారిలో అత్యధికులు ఐదు రాష్ట్రాల నుంచే ఉన్నారు. మన రాష్ట్రం తర్వాత ఏపీ, మహారాష్ట్ర నుంచి ఏడుగురుచొప్పున 100 పర్సంటైల్ సొంతం చేసుకొన్నారు. రాష్ట్రానికి చెందిన హుండేకర్ విధిత్, ముత్తవరపు అనూప్, వెంకటసాయితేజ మదినేని, రెడ్డి అనిల్, రోహన్‌సాయి పబ్బా, శ్రీ యాష్ మెహన్, కల్లూరి, కేసం చెన్నబసవారెడ్డి, మురికినాటి సాయిదివ్యతేజారెడ్డి, రిషి శేఖర్ శుక్లా, తవ్వ దినేశ్‌రెడ్డి, గంగా శ్రేయాష్, పొలిశెట్టి రితిశ్ బాలాజీ, తమటం జయదేవ్‌రెడ్డి, మావూరు జస్విత్, డీ శ్రీనివాస్‌రెడ్డి 300లకు 300 మార్కులు సాధించారు. క్యాటగిరీ ర్యాంకుల్లోనూ ఆలిండియా టాపర్లుగా నిలిచారు. ఆలిండియా ఎస్టీ టాపర్‌గా రాష్ట్రానికి చెందిన జగన్నాథం మెహిత్ సత్తాచాటారు.

ర్యాంకులు పొందిన విద్యార్థులతో శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ

'శ్రీ చైతన్య' విద్యార్థుల ప్రతిభ

హైదరాబాద్, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ): జేఈఈ మెయిన్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు ఆలిండియాలో 1, 3, 6,9 ర్యాంకులు సాధించి ప్రతిభ చూపారని శ్రీ చైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలిండియా క్యాటగిరీలో 10 లోపు 4 ర్యాంకులు, ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో 100 లోపు 25 ర్యాంకులు, 200 లోపు 46 ర్యాంకులు సాధించినట్టు పేర్కొన్నారు. ఆలిండియాలో కేసీ బసవరెడ్డి 1వ ర్యాంకు, తోటంశెట్టి నిఖిలేశ్ 3వ ర్యాంకు, హిమాన్షూ తాలర్ 6వ ర్యాంకు, రెడ్డి అనిల్ 9వ ర్యాంకులతో సత్తా చాటినట్టు వివరించారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో 272 మంది విద్యార్థులు వంద పర్సంటైల్ సాధించారని పేర్కొన్నారు. ర్యాంకులు పొందిన విద్యార్థులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు.

విద్యార్థులతో విజయసంకేతం చూపుతున్న 'నారాయణ' ఎండీలు పీ సింధూర, పీ శరణి

జేఈఈలో 'నారాయణ' హవా

హైదరాబాద్, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ): జేఈఈ మెయిన్ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు 10 లోపు 6 అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారని నారాయణ విద్యాసంస్థల ఎండీలు పీ సింధూరనారాయణ, పీ శరణీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో జీ నీల్‌కృష్ణ 1వ ర్యాంకు, హెచ్ విదిత్ 5వ ర్యాంకు, ఎం అనూప్ 6వ ర్యాంకు, ఎం సాయితేజ 7వ ర్యాంకు, సీహెచ్ సతీశ్‌కుమార్ 8వ ర్యాంకు, ఆర్యన్ ప్రకాష్ 10వ ర్యాంకు, పీ రోహన్‌సాయి 12వ ర్యాంకు కైవసం చేసుకొన్నారని పేర్కొన్నారు. ఆలిండియా ఓపెన్ క్యాటగిరీల్లో 100 లోపు 28, 1000 లోపు 171 ర్యాంకులు సాధించారని తెలిపారు. ఆలిండియా అన్ని క్యాటగిరీల్లో 10లోపు 25, 100 లోపు 112, 1000 లోపు 735 ర్యాంకులతో ప్రతిభ చూపారని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను, సిబ్బందిని అభినందిస్తున్నట్టు పేర్కొన్నారు.

మైనార్టీ గురుకులాల్లో 89% ఉత్తీర్ణత

హైదరాబాద్, ఏప్రిల్25 (నమస్తే తెలంగాణ): మైనార్టీ గురుకులాల్లో ఇంటర్ చదువుతున్న 89 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని మైనార్టీ గురుకులాల కార్యదర్శి ఆయేషా మస్రత్ ఖానం తెలిపారు. ఈ ఏడాది మొత్తం 17,543 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయగా, 14,352 మంది విద్యార్థులు పాస య్యారని వెల్లడించారు. ఇంటర్ సెకండియర్ విద్యార్థులు 89శాతం, ఫస్టియర్ విద్యార్థులు 76 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

కేకేఆర్ గౌతమ్ స్కూల్స్ సత్తా

ఆలిండియా 3, 8వ ర్యాంకులు సాధించిన విద్యార్థులు

హైదరాబాద్, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ): జేఈఈ మెయిన్ ఫలితాల్లో డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్స్ పూర్వ విద్యార్థులు వివిధ క్యాటగిరీలలో మొదటి 100లోపు ర్యాంకుల్లో 17 ర్యాంకులు సాధించి సత్తా చాటారని ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. తోటంశెట్టి నికిలేశ్ ఆలిండియా 3వ ర్యాంకు, అరిపికట్ల తేజస్వి 8వ ర్యాంకు, పీ విద్యప్రవీణ్ 14వ ర్యాంకు, సతివాడ జ్యోతిరాధిత్య 17వ ర్యాంకు సాధించినట్టు పేర్కొన్నారు. మొదటి 100 లోపు ర్యాంకుల్లో వివిధ క్యాటగిరీలలో 3, 8, 14, 17, 20, 21, 23, 28, 31, 35, 41, 48, 55, 56, 69, 84, 99 ర్యాంకులు కైవసం చేసుకొన్నట్టు వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక సిబ్బందికి అభినందనలు తెలిపారు.

అంబులెన్స్ రాక.. ఆటోలో దవాఖానకు గర్భిణి

ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం పూనగూడకు చెందిన పెందోర్ విజ్జుబాయికి గురువారం పురిటి నొప్పులు వచ్చాయి. ఆశా కార్యకర్త అంజన్నబాయి 108, 102 (ఎమర్జెన్సీ, అమ్మ ఒడి) అంబులెన్స్ డ్రైవర్లకు ఫోన్ చేయగా అందుబాటులో లేమని చెప్పారు. దీంతో ఆశా కార్యకర్త, అంగన్‌వాడీ టీచర్‌తోపాటు ఆదివాసీ సంఘాల నేతలు పెందోర్ తెలంగ్‌రావ్, కుడ్మెత దుర్గారావు, పెందోర్ చందు, దేవురావు, గ్రామస్థులు కలిసి ప్రైవేట్ ఆటోలో గర్భిణీని ఝరి దవాఖానకు తరలించారు. -నార్నూర్

ర్యాంకులు సాధించిన విద్యార్థులతో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి

అల్ఫోర్స్ విద్యార్థుల విజయఢంకా

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు వివిధ క్యాటగిరీలలో విజయఢంకా మోగించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ ట్రైనిటాట్స్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విద్యార్థులను అభినందించి, మాట్లాడారు. ఫలితాల్లో ఎం హర్షిత్ 252వ ర్యాంకుతో అత్యున్నత స్థానంలో నిలువగా, ఏ వర్జన్ రావు 444, పీ మనోహర్ 466, జీ శ్రీహాస్ 503, బీ భరద్వాజ్ నాయక్ 781, పీ చందన 1213, సత్యాఅమూల్యా 1301, సుభోదౌదరి 1367, కే శ్రీనిధి 1562, ఎండీ షఫిక్ 1603, మిత్ర 1612, సీహెచ్ అనూహ్య 1632, ఏ శివవరుణ్ 1719, ఎస్ ప్రణయ్ 1721, పీ రాహుల్ 1751, ఎం ప్రణీత్ రెడ్డి 1912, జే ఉమామైత్ర 1953, ఎల్ అరుణ్ కుమార్ 2353, సీహెచ్ సిద్దార్థ 2444, పీ రఘువీరారెడ్డి 2510, కే విశాల్ రెడ్డి 2557, కే రోహన్ ప్రీత్ 2643, జే హర్ష వర్ధన్ 2908, జీ లహరి 2965వ ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ కీర్తిని మరింత ఇనుమడింపజేశారని తెలిపారు.

ఎస్సార్ విద్యాసంస్థల ప్రభంజనం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఎస్సార్ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి, ప్రభంజనం సృష్టించారని ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఏ వరదారెడ్డి తెలిపారు. ఓపెన్ క్యాటగిరీలో దొంతుల మనీశ్ 126 ర్యాంకు, ఆలిండియా రిజర్వేషన్ క్యాటగిరీలో జీ నవీన్ 5వ ర్యాంకు, ఏ నందిని 12వ ర్యాంకు, వై సాత్విక్‌రెడ్డి 42వ ర్యాంకు, జీ కాలు 55వ ర్యాంకు సాధించి ఎస్సార్ కీర్తి ప్రతిష్ఠను జాతీయస్థాయిలో నిలబెట్టారని పేర్కొన్నారు. అదేవిధంగా, దాసరి కార్తిక్ 131, జే శ్రీధన్‌రెడ్డి 144, కే ప్రశాంత్‌రెడ్డి 148, తుమ్మ తేజస్వీ 149, కాసారాం అఖిల్‌యాదవ్ 154, పీ నిహాల్ శ్రీవాత్సవ్ 186, కే శ్రీరాంరెడ్డి 192, తుమాటి అమృతవర్షిణి 201, కే రమణారెడ్డి 211, టీ శ్రేష్ఠ 225, పీ రిత్విక్ 314ర్యాంకుతో పాటు ఓపెన్ అన్ని క్యాటగిరీలలోకలిపి ఆలిండియాలో వరుసగా 357, 385, 430, 431, 433, 497, 530, 614, 550, 599, 625, 662, 730, 782, 783, 788, 800, 861, 870, 872, 944 ర్యాంకులు కైవసం చేసుకొన్నట్టు వివరించారు. ఇప్పటివరకు 3,256 మందికిపైగా విద్యార్థులు అడ్వాన్స్‌కు అర్హత సాధించినట్టు తెలిపారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ల గడువు ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 893 మంది అభ్యర్థులు 1488 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అత్యధికంగా మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి 114 మంది అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేశారు. ఆ తరువాత చేవెళ్లలో 64 మంది, పెద్దపల్లిలో 63, భువనగిరిలో 61 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. అతి తక్కువగా ఆదిలాబాద్‌లో 23 మంది, నాగర్ కర్నూల్‌లో 34 మంది నామినేషన్ వేశారు. శుక్రవారం అభ్యర్థుల నామినేషన్లను పరిశీలించనున్నారు. 29న నామినేషన్ ఉపసంహరణ గడువు ముగియనున్నది. అదే రోజు బరిలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాను, వారి కేటాయించిన గుర్తులను ప్రకటిస్తారు.

నకిలీ విత్తనాల కట్టడి అవసరం

ఎఫ్ఏవో డైరెక్టర్ జనరల్ డొంగ్యూ

హైదరాబాద్, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ): నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కఠిన నిబంధనలు అమలు చేయాలని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ ఆహార సంస్థ(ఎఫ్ఏవో) డైరెక్టర్ జనరల్ డాక్టర్ క్యూ డొంగ్యూ సూచించారు. బుధవారం ఇటలీలో అంతర్జాతీయ విత్తన పరీక్ష ప్రమాణాల సంస్థ (ఇస్టా) అధ్యక్షుడు డాక్టర్ కేశవులు, డొంగ్యూతో భేటీ అయ్యా రు. విత్తన రంగం సమస్యలు, పరిష్కారాలపై డొంగ్యూ సూచనలు చేసినట్టు కేశవులు తెలిపారు. ప్రభుత్వరంగంలో విత్తనోత్పత్తి పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

టెట్‌పై ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రభావం!

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : టీచర్ ఉద్యోగార్థుల కోసం నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)పై ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రభావం పడనున్నదా? పరీక్షను వాయిదా వేయాల్సిందేనా? అంటే అవుననే సంకేతాలు వెలువడుతున్నాయి. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల షెడ్యూల్ గురువారం విడుదలైంది. మే 27న ఉప ఎన్నిక పోలింగ్ జరగనున్నది. అయితే మే 20 నుంచి జూన్ 3 వరకు టెట్ పరీక్షలను ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో నిర్వహిస్తామని ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. పోలింగ్ రోజు ఆయా జిల్లాల్లో సాధారణ సెలవుగా ప్రకటిస్తారు. టెట్ పరీక్షకు హాజరయ్యేవారంతా పట్టభద్రులేకానుండటంతో వీరంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలోనే టెట్ పరీక్షల నిర్వహణపై పాఠశాల విద్యాశాఖ అధికారులు తర్జనభర్జనలు పడుతున్నారు. ఇప్పటివరకు ఏ తేదీన ఏ పేపర్‌కు పరీక్ష నిర్వహిస్తారో వెల్లడించలేదు. ఎన్నికల షెడ్యూల్ దృష్ట్యా పేపర్ల వారీగా పరీక్షలు నిర్వహించే తేదీలతో కూడిన షెడ్యూల్‌ను విడుదల చేయాలని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
దమ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

ఓపెన్ ఇ-టెండరు ప్రకటన నం. C/E.29/Elec/M/SC/03/REV/OT/2024-25 తేది: 24.04.2024 PUB/0377

భారత రాష్ట్రపతి తరపున దిగువ సంతకందారు దిగువ ఇచ్చిన పని కొరకు 16.05.2024న 15.00 గంటల వరకు ఇ-టెండరు కోరుచున్నారు.

క్ర.సం. 1, ఇ-టెండరు నం. etender No. C/E.29/Elec/M/SC/03/REV/OT/2024-25, etender No. E-M-SC-03-OT-2024-25, పనిపేరు: సికింద్రాబాద్ డివిజన్-విద్యుత్ నిర్వహణ శాఖ: AC/SC డిపో & AC/HYB వద్ద విఘాతం కలగకుండా/పాడు చేయకుండా విద్యుత్ వైరింగ్ సంరక్షణార్థం ఎలకల బెడదను నివారించడానికి కాంటాక్టర్లు మరియు దాని ప